క్లుప్తంగా

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ రఘురామయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం: స్థానిక ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రఘురామయ్యను సోమవారం స్థానిక కార్యలయం సిబ్బంది, పలువురు పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో తీసుకువెళ్లి ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామన్నారు.

ఇంకుడు గుంతలతో జలవృద్ధి

దక్కిలి: ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయని ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు షఫీ, సాంబయ్య అన్నారు. సోమవారం దక్కిలిలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం అవరణలో ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న ఇంకుడు గుంతను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి పంచాయతీలో ఒక చోట విడతలు వారీగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

మైనింగ్ లీజులు ఇవ్వొద్దు

సైదాపురం: మండలంలోని దాడిశెట్టిపల్లి సమీపంలోని షామైన్ పరిసరా ప్రాంతాల్లో ఉన్న అటవీ భూముల్లో మైనింగ్ లీజులు మంజూరు చేయవద్దని దాడిశెట్టిపల్లి, గిరిజన ఎస్సీకాలనీ వాసులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు విన్నవించుకున్నారు. వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 532 నుంచి 534 వరకు ఉన్న అటవీ భూముల్లో మైనింగ్ లీజులు ఇస్తే తమ కాలనీ వాసులకు ప్రాణహాని ఉంటుందన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

గూడూరు రూరల్: పట్టణంలోని న్యూబాలజీ నగర్‌లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు చెప్పారు. సోమవారం న్యూబాలజీనగర్ వాసులు తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకు విన్నవించడంతో వెంటనే ఆయన మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులు, నాయకులతో కలసి ఎమ్మెల్యే న్యూ బాలాజీ నగర్‌లో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యూ బాలాజీ నగర్‌లో తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించామన్నారు. న్యూబాలాజీ నగర్ పోటుపాళెం పంచాయతీ పరిధిలో ఉండడంతో మున్సిపల్ అధికారులు తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోలేదన్నారు. అయితే పోటుపాళెం పంచాయతీ గూడూరు గ్రేడ్-1 మున్సిపల్‌లో విలీనం చేయడంతో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసమూర్తి, రాఘవరెడ్డి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని రిక్షా కార్మికుడి మృతి

సూళ్లూరుపేట: కారు ఢీకొని రిక్షా కార్మికుడు మృతిచెందిన ఘటన సూళ్లూరుపేట పట్టణంలోని హోలీక్రాస్ జంక్షన్ సమీపంలోని కాళంగినది బ్రిడ్జిపై సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో వట్రపాళేనికి చెందిన రిక్షా కార్మికుడు కువ్వాకొల్లి రాజా (40) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం.. వట్రపాళెంకు చెందిన కువ్వాకొల్లి రాజా ఎప్పటిలాగే సోమవారం తెల్లవారుజామున లేచి రిక్షా తీసుకుని పట్టణంలోకి వస్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే రిక్షా కార్మికుడు రాజా మృతి చెందాడు. కారులో ఉన్న వారు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే ఆగి ఉన్న కారును స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

పెళ్లకూరు: చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని పునబాక గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన రాధయ్య(55) చెరువు గట్టు మీద పశువులు మేపుకుంటూ ఉండగా కొన్ని గేదెలు చెరువులోకి దిగాయి. దాంతో నీళ్లల్లో ఉన్న గేదెలను చెరువు కట్టపైకి తరిమేందుకు చెరువులోకి దిగి బురదలో కూరుకుపోయాడు. ఆపై ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాపూరు: మండలంలోని తూమాయి గ్రామం సమీపంలోని రైల్వే వంతెన వద్ద సోమవారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం మేరకు..తూమాయి బ్రిడ్జి 55-4 వద్ద కృష్ణపట్నం నుంచి ఓబులాపురం వెళ్లే గూడ్స్‌రైలు గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహం బోర్ల పడి ఉందని, తల భాగం పూర్తిగా వేరైంది.

దక్కిలిలో మోస్తరు వర్షం

దక్కిలి: ఈశాన్య రుతు పవనాలతోపాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులు నుంచి మండలంలోని పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షంతో పాటు అక్కడక్కడ భారీ వర్షం కురిసింది. సోమవారం కూడా జల్లులు కురిశాయి.

చరిత్ర సృష్టించిన ప్రజా సంకల్పం

- గూడూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు
- వైఎస్సార్ విగ్రహానికి నివాళి, కేక్ కటింగ్
- ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ



గూడూరురూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు



సైదాపురం: పాలాభిషేకం చేస్తున్న నేదురుమల్లి

గూడూరురూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరేళ్ల కిందట చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. ప్రజాసంకల్పపాదయాత్రకు ఆరేళ్లు పూర్తి అయిన సందర్భంగా సోమవారం గూడూరులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బనిగీసాహెబ్‌పేటలోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని వారి కన్నీళ్లను తుడిచేందుకు ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారన్నారు. ఆయన చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల దూరం సాగించి, 2 కోట్ల మంది ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి బాటలు వేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించి ఇచ్చిన హామీలను 95 శాతం అమలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు తిరునాళ్లలా సాగిందన్నారు. అంబేడ్కర్ సామాజిక న్యాయాన్ని అక్షరాల పాటిస్తున్న జగన్ మోహన్‌రెడ్డికే రానున్న 2024 ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారన్నారు. అనంతరం గూడూరు ఏరియా ఆస్పత్రిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కే మీరారెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కే మీరారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కే గోవర్ధన్, చిల్లకూరు జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య, ఏ మురళి, గఫూర్, పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నరసయ్య, ఎం చంద్రమోహన్‌రెడ్డి, అల్తాఫ్, కృష్ణయ్య, జేసీఎస్ కన్వీనర్లు రాఘవరెడ్డి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

వెంకటగిరిరూరల్/సైదాపురం: జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుండే నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు నిలుపుతూ ధృడ సంకల్పంతో ముందుకు వెళ్తున్నారని వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు సోమవారం పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ మాట్లాడుతూ ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునే దిశగా దేశంలో ఇప్పటి వరకు ఎవరూ చేయని విధంగా 341 రోజులపాటు 3,648 కిలోమీటర్లు సుదీర్ఘ ప్రజా సంకల్పయాత్రను చేశారన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద మాట్లాడుతూ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 98శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్ సురేష్‌రెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ పీ ప్రసాద్‌రెడ్డి, విప్ పీ లక్ష్మి, కౌన్సిలర్లు ఎంఏ నారాయణ, కే కళ్యాణి, ఏ శ్రీనివాసులు, ఎం జానకిరామయ్య, శంకరయ్య, నాయకులు రాజారెడ్డి, సీహెచ్ మురళి, తాజ్‌ఉద్దీన్, కాటయ్య, శ్రీనివాసులు, మల్లిరెడ్డి, గణేష్‌రెడ్డి, పేజీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో ముందుకు..

సైదాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతూ దృఢ సంకల్పంతో ముందుకెళుతున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని తుమ్మలతలుపూరులో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్రటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం నేదురుమల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం రవికుమార్, వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యులు వి.ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆదిశేషయ్యనాయుడు, నేతలు వెంకటప్పనాయుడు, భాస్కర్‌నాయుడు, ఎం రామ్‌గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ భాస్కర్, శంకర్‌రెడ్డి, వరప్రసాద్‌రాజు, రాజశేఖర్‌నాయుడు, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





వెంకటగిరి రూరల్! వెఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ, దొంతుశారద, నేతలు, కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గూడూరురూరల్ : రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు

జనరంజక పాలన జగనన్నకే సాధ్యం



లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి

సైదాపురం: రాష్ట్రంలో జనరంజక పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం తుమ్మలతలుపూరులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. నేదురుమల్లి మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై టీడీపీ నుంచి అధిక సంఖ్యలో తమ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. వారికి పార్టీలో సముచితమైన స్థానాన్ని కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎం రవికుమార్, కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ జీ శ్రీనివాసులురాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆదిశేషయ్య, నేతలు డీ శ్రీకాంత్, వెంకటప్పనాయుడు, ఎస్ రామ్‌గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీను, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

15,582 మంది రైతులకు రైతు భరోసా

సూళ్లూరుపేట రూరల్: సబ్‌డివిజన్ పరిధిలోని తడ, దొరవారితసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో 15,582 మంది రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం రూ. 6.4కోట్ల లబ్ధి చేకూరనుందని ఏడీఏ అనిత తెలిపారు. ఈ నిధులను ప్రభుత్వం నేరుగా ఈ నెల 7వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేయనుందని తెలిపారు. కొత్తగా 600 మందికి రైతులకు భరోసా మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతికి సీఎం కృషి

ఓజిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అన్నారు. ప్రజాసంకల్పపాదయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పాదయాత్రను చేసి, ప్రజల కష్టాలను తెలుసుకున్నారన్నారు.

జయప్రదం చేయండి

దొరవారిసత్రం: హైదరాబాద్‌లో మందా కృష్ణామాదిగ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ మండల ఇన్‌చార్జి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. సోమవారం జనసమీకరణలో భాగంగా పలువురు నాయకులు ఆర్మేనికండ్రిగ, బూదూరు, తనియాలి గ్రామాల్లో పర్యటించారు. ప్రతి మాదిగ కుటుంబం నుంచి జనం తరలి రావాలని కోరారు.

ఈ-క్రాప్ తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ భవానీ

చిల్లకూరు: రైతులకు ప్రభుత్వం ద్వారా అందించే రాయితీ పథకాలు అందుకోవాలనుకుంటే ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ భవానీ తెలిపారు. ఈ-క్రాప్ రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించే క్రమంలో సోమవారం పారిచెర్లవారిపాళెం ఆర్బీకేని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ చేయించుకుని, ప్రభుత్వ పథకాలు అందుకోవాలన్నారు. అలాగే వర్షాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రతి రైతూ ముందుగానే విత్తనాలు సిద్ధం చేసుకుని దుక్కులు పూర్తి చేసుకుంటే చెరువులో నీరు చేరిన వెంటనే నాట్లు వేసుకునే వీలుంటుందని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందించేలా ఈ రబీ సీజన్‌లో ప్రణాళికలను సిద్ధం చేసి, స్టాక్ చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు చెంచుకృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తుల ఆహ్వానం

పెళ్లకూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్‌స్కూలు విధానంలో పదో తరగతిలె ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఎలాంటి విద్యార్హత అవసరం లేని 14 ఏళ్లు నిండిన వారు పాఠశాలలో చేరే అవకాశం ఉందన్నారు. పుట్టిన తేదీ, కులం సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100తో కలిపి కోర్సు ఫీజు రూ.1,450 చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100తో పాటు కోర్సు ఫీజు రూ.1,050 చెల్లించాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(సీఈసీ, హెచ్ఈసీ) చేరేందుకు ఎస్ఎస్‌సీ లేదా ఐటీఐ పాస్ అయిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9030841870, 7981280164 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ

గూడూరురూరల్: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా కృషి చేస్తున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి ప్రజలు పాల్గొని, సమస్యలపై అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా ఆయా మండలాల అధికారులను ఆదేశించామన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచితంగా అర్జీలను రాసేలా ప్రతి సోమవారం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక శ్రద్ధ చూపండి



రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ ప్రసన్నలక్ష్మి

రాపూరు: పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీవైఈఓ ప్రసన్న లక్ష్మి అన్నారు. రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేసి ఉపాధ్యాయులతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు నిత్యం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆమె పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, సమాధానం రాబట్టారు. కష్టపడి చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంఈఓ జిలానీ, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బాలసుబ్రమణ్యం ఉన్నారు.

కాళంగి వంతెనకు రూ. 35 కోట్లు మంజూరు

సూళ్లూరుపేట: పట్టణ సమీపంలోని కాళంగినదిపై నూతన వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసిందని, దీంతో తన చిరకాల కోరిక ఫలించిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. సోమవారం ఆయన విజయవాడలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో జీఓ తీసుకుని వెంటనే ఫోన్‌చేసి ఈ సమాచారాన్ని అందించి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి అడగ్గానే నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో వీలైనంత తొందరలో టెండర్లు ప్రక్రియ నిర్వహించి, పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

నిర్దేశిత ప్రాంతాల్లోనే టపాసుల దుకాణాలు

గూడూరురూరల్: దీపావళి పండు సందర్భంగా బాణసంచా దుకాణాలను లైసెన్స్‌దారులు నిర్దేశిత ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం రాత్రి అన్ని శాఖల అధికారులతో ఆయన బాణసంచా దుకాణాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేసుకునే విక్రయదారులు తమ ఇష్టానుసారం ఏర్పాటు చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు పాక్షికంగా తాగునీరు

గూడూరురూరల్: పట్టణంలో మంగళవారం తాగునీరు పాక్షికంగా మాత్రమే అందించనున్నామని, పట్టణ ప్రజలు ఈ విషయం గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కండలేరు డ్యామ్ వద్ద సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేక పోవడంతో పట్టణంలోని వాటర్ ట్యాంకులకు పూర్తిస్థాయిలో తాగునీరు చేరలేదన్నారు. దీంతో పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా చేయలేక పోతున్నామన్నారు.

కోట అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి

కోట: మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆగిపోయిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో సమీక్షించారు. ఎంపీడీఓ భవనీ మాట్లాడుతూ కోటలో రోడ్లను రూ.3 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్వర్ణముఖి పంట కాలువల పూడిక తీయించి మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు మొబీన్ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శేషయ్య, సౌజన్య, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, తహసీల్దార్ పద్మావతి, ఏఓ నిరంజన్ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పనకే యాత్ర



అడవి కొట్టు రాజుకు స్వాగతం పలుకుతున్న జెడ్పీటీసీ సభ్యుడు

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే బైక్ యాత్ర చేపట్టినట్లు ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవికొట్టు రాజు తెలిపారు. బైబిల్ పట్టుకుని దేవుని సువార్తను చాటి చెప్పే తాను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన లాంటి పేదల కోసం చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించేలా రెండోసారి బైక్ యాత్ర చేపట్టానని చెప్పారు. పర్యటనలో భాగంగా సోమవారం చిల్లకూరు మండలానికి చేరుకున్న ఆయనకు జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య సాదర స్వాగతం పలికారు. వరగలి క్రాస్ రోడ్డులో అడవి కొట్టు రాజు మాట్లాడుతూ ఉదయగిరిలో అక్టోబర్ ఒకటిన తాను బైక్ యాత్ర ప్రారంభించి, గూడూరు నియోజకవర్గంలోకి చేరానన్నారు. చిల్లకూరు మండలంలో జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య, సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ స్కావెంజర్స్ కమిటీ స భ్యులు ప్రభాకర్ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

అన్ని హామీల అమలు ఘనత జగనన్నదే



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

దక్కిలి: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ గోను రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీ జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం దక్కిలిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల ఉపాధ్యక్షుడు జీ చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పీ దశరథరామిరెడ్డి, వేణునాయుడు, ఎం నారాయణరెడ్డి, డీపీ యాదవ్, బలరామిరెడ్డి, అరుణాచలం, ప్రభాకర్, నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

సులభరీతిలో బోధించాలి

దక్కిలి: విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభరీతిలో బోధించాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండలంలోని ఎగువమార్లగుంట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థులు సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పలు రికార్డులు, విద్యార్థులు హాజరును తనిఖీ చేశారు.